# అనాథ

శ్రీ ఆకెళ్ల రామబ్రహ్మశాస్త్రిగారు

‘ఏమండి, అమ్మాయికి యుక్తవయస్సు వచ్చిందిగదా. ఈ సంవత్సరంతో మెట్రిక్యులేషన్ పూర్తి అవుతుంది. పెండ్లిచేసి ఓ యింటిదానిని చేయుట మంచిదిగాదా.’

‘అవును. ఆ సంగతే నేనూ అనుకుంటూన్నాను. విద్యాభూషణునకు యుక్తవయస్సు వచ్చింది. ప్రాక్టీసు ఆరంభించేడు. మంచి తెలివైనవాడని, వృద్ధిలోకి రాగలడని నిన్ననే జడ్జిగారు బహుగొప్పగా పొగిడి ‘మీ అబ్బాయా?’ అని నన్ను అడిగేరు. అప్పుడు, మనవాడు కాదని, అసలు వృత్తాంతమంతా చెప్పేను.’

విద్యాభూషణుడు తనగదిలో కూర్చొని మర్నాడు తీర్పుచెప్పబోయే తన పార్టీ దావాకై లా పుస్తకాలు తిరగవేస్తున్నాడు. ప్రక్కగదిలోని ఆ దంపతుల కబుర్లు విద్యాభూషణుని ఆకర్షించేయి. పుస్తకం మూసేసి జాగరూకతతో విన్నాడు. తనచెవుల తానే నమ్మలేకపోయేడు. తను విన్నది మరల మరల తర్కించుకొనుచుండగా బర్రున గదితలుపు చప్పుడైంది. అదిరిపడి వెనక్కి చూసేడు. ‘విద్యాభూషన్! ఏమి అదరిపడ్డావు? అదేమి కలవరపడుచున్నావు?’ అంది చదరంగమాడుకొనుటకు వచ్చిన లక్ష్మి.

‘అబ్బే, ఏమీలేదు లక్ష్మీ! నేడు ఒంట్లో బాగుండలేదు. కొద్దిగ తలనొప్పిగా యుంది’ అని సర్దుకున్నాడు. కాని సోదరప్రేమతో ఉపచర్యచేయుచున్న లక్ష్మిని చూడగానే విద్యాభూషణుడు ఆవేదనతో ‘లక్ష్మీ! నేను నీ సహోదరుడను కాను. నా తల్లిదండ్రులెవరో వేరు. వారిని నేనే ఎరుగను...’

‘విద్యాభూషన్! ఏమనుచున్నావు? కలవరిస్తున్నావా?’ అంది మాటకడ్డంవచ్చి.

‘లేదు. లక్ష్మీ! లేదు. కలవరించుటలేదు. యదార్థమే చెప్పుచుంటి. మీ అమ్మ, నాన్నగార్లు చెప్పుకుంటూంటే విన్నాను. యింకా విన్నాను. నీ వివాహముగురించి నిన్ను నా...నా...నా’ అని తడబడ్డాడు.

ఆమాట వినగానే లక్ష్మి కంగారుపడుచు నిశ్చేష్టయై నిలువబడిపోయింది. ‘లక్ష్మీ! భయపడెద వేల? నేను ఉన్మత్తుడను కాను. నన్ను నమ్ముము.’

‘అమ్మ, నాన్నగార్లు ఎవరినిగురించి చెప్పుకుంటున్నారో! పరధ్యానంలో నీకలా వినబడవచ్చును. రేపు నిజము కనుకుంటా’నని చెప్పి లక్ష్మి తనగదిలోకి వెళ్లిపోయింది.

లక్ష్మి నిద్రబోవ ప్రయత్నించింది. కాని ఆలోచనాపరంపరలతో నిద్రరాలేదు. ఒక్కనాడు కూడ పరాకునైనా తన తల్లికాని, తండ్రికాని విద్యాభూషణుడు తన సోదరుడు కాడని చెప్పలేదే. యిప్పుడు విద్యాభూషణునకు తననిచ్చి వివాహముచేతురా? ఏమో! అజాగ్రతావస్థలో విద్యాభూషణుడు తన మనో వాంఛను తెలుపుచున్నాడా? ఛా! అదెన్నటికి కానేరదు. సోదరభావముతో సర్వదా ప్రేమించు విద్యా భూషణుడు నేడు యిట్లు మాట్లాడునా? ఏమీ పాలుపోవడంలేదు లక్ష్మికి.

తెల్లవారింది. లేచీ లేవడంతోనే తల్లినిచేరి ‘అమ్మా! విద్యాభూషణుడు నాకు అన్నయ్య కాడుటే? నిన్నరాత్రి నాన్నగారు, మీరు చెప్పుకుంటూంటే విద్యాభూషణుడు విన్నాడుట.’ యదార్థము

చెప్పుటా? మానుటా? యని తటపటాయిస్తూండగా పురుషోత్తమరావుగారాలా రావడంచూచి లక్ష్మి తల్లి పనియున్నట్లుగా చక్కాపోయింది. తల్లిదండ్రులు తనను తప్పించి తిరగడం లక్ష్మికి అనుమానంగానేయుంది. యింకా ఏమి విన్నాడో కనుకుందామని విద్యాభూషణుని గదిలోకి వెళ్ల ప్రయత్నించింది. కాని మునుపటి వలె చొరవగా వెళ్లుటకు సిగ్గుపడింది. యీడుజోడుగా యున్న విద్యాభూషణుడు తనప్రాణ విభుడగుట మనస్సున చాల ఆనందించింది. తక్కుతూ తారుతూ గదిలో ప్రవేశించి చదరంగంబల్ల దగ్గరకు లాక్కొని కూర్చుంది. ఆట ప్రారంభించేరు.

‘లక్ష్మీ! ఎత్తువెయ్యి. చాలసేపు ఆలోచిస్తున్నావే ఈవేళ.’

‘ఏముంది మీతో నే నాడగలనా?’

‘ఓహో! మీ-మీ అంటూ మొదలెట్టేవు. సంగతేమి?’ అన్నాడు మందహాసంతో.

ఆమాటతో లక్ష్మి కొక్కసారిగా ఒళ్ళంతా గగుర్పొడిచింది. విద్యాభూషణుని తలఎత్తి చూచుటకు సిగ్గుపడి గదిలోంచి పారిపోయింది.

మర్నాడు తనపార్టీ దావా హియరింగు అగుటచే విద్యాభూషణుడు కోర్టుకు వెళ్లేడు. తనపార్టీ తరఫునెగ్గింది. నెగ్గదనుకున్న దావా నెగ్గినందులకు తనపార్టీయే కాకుండ జడ్జీకూడ చాల ఆశ్చర్యపోయేడు. విద్యాభూషనుని తెలివి తేటలకు, సమయస్ఫూర్తికి అచ్చెరవొంది, జడ్జి విద్యాభూషణుని తనయింటికి విందుకు తీసుకెళ్ళేడు. తన వృత్తాంతముగురించి పురుషోత్తమరావుగారేమి చెప్పిరో జడ్జిగారి నడుగుటకు సమయమునకై వేచియున్న విద్యాభూషణునకు నేడు వీలుచిక్కినది. విందు జరుగుతోంది. ఆ ప్రశంస ఎత్తేడు. తనువిన్నది ఆయనతో చెప్పి తన జీవితరహస్యమును ఆయన చెపుతూంటే వింటున్నాడు.

‘పురుషోత్తమరావుగారు పాతిక సంవత్సరాలక్రితం భద్రాచలం తీర్థం వెళ్ళేరుట. ఆ సంవత్సరం శ్రీరామ కళ్యాణము చూచుటకై దేశ దేశాలనుంచి యాత్రికులు వచ్చేరుట. భద్రాచలం అతి కోలాహలంగా యుందట. శ్రీరామకళ్యాణము పూర్తిఅయింది. మరునాడు ఎవరిఊళ్లకు వాళ్లు ప్రయాణం కట్టేస్తున్నారట. ఉదయమునే పురుషోత్తమరావుగారు గుళ్లోకిపోయి వస్తూంటే ‘క్యారు, క్యారు’ మని ఏడ్పువినబడి ఆ ధ్వనినిబట్టి వెళ్లిచూడగా గుడిమంటపముపై 10 నెలల మగశిశువు కనబడ్డాడుట. ఆ పిల్లవానిని చంకబెట్టుకొని కనబడ్డవారినెల్ల అడుగుతూ ఆరోజల్లా పిల్లవాని తల్లిదండ్రులకై వెదికేరుట. చివరకు ‘నా’ అనే వారెవరు లేకపోవుటచే పిల్లవానితో యింటికి వచ్చేసేరుట. వారికి అప్పటికి సంతానము లేకపోవుటచే ఆపిల్లవాడు తమకు శ్రీరామ ప్రసాదమని యెంచి అతిగారాబాగా పెంచుచుండిరి. తర్వాత 4, 5 సంవత్సరాలకు వారికో ఆడపిల్ల గల్గింది. ఆపిల్లకు లక్ష్మియని నామకరణంచేసి అల్లారుముద్దుగా పెంచుచుండేవారు. ‘విద్యాభూషన్! నీవేసుమా భద్రాచలంలో లభించిన పిల్లవాడవు. పురుషోత్తమరావుగారే నీకీ సంగతిచెప్పి, లక్ష్మిని నీకు వివాహముచేయ సంకల్పించుకున్నారు’

అప్పటికప్పుడే రాత్రి 9 గంటలగుటచే విద్యాభూషణుడు వారివద్ద సెలవుతీసుకొని యింటిదారి పట్టేడు. ఎంతసేపూ భద్రాచలరామమంటప వృత్తాంతమే తలలో తిరుగుతోంది. తనతల్లి ఏవేశ్యయో లేక ఏ పూర్వసువాసినో తప్పుత్రోవలబోయి, తన నచ్చోట వదలి పోయిందేమో యని ఆలోచనలో పడ్డాడు. నెమ్మదిగా గోదావరీ యొడ్డు దగ్గరకొచ్చుసరికి ‘బుడ, బుడ’ మను శబ్దము వినబడి చూచుసరికి నీటిపై మునుగుతూ తేలుతూయున్న స్త్రీ శరీరం కనబడింది. గబాలున నదిలోఉరికి ఈతవచ్చిన వాడగుటచే ఆమెను ఒడ్డుకు లాక్కొచ్చి డాక్టరు సహితంగా యిల్లుచేరేడు. మర్నాటికి ఆమెకు మాట్లాడుటకు ఓపికగల్గింది. తన

కుపచర్యచేయుచున్న లక్ష్మి, విద్యాభూషణుల తేరిపార చూసింది. విద్యాభూషణుని చూచుసరికి అంతరాత్మ ఏదో చెపుతున్నట్లుగా అయింది. మాతృగర్భం పీకులాడింది. తన కుమారుని పోలికలు గన్పట్టేయి. కాని పైకి చెప్పలేకపోయింది. భాగ్యవంతుల యింట్లోవారిని తన బిడ్డడని ఎట్లు అనగలదు? ఆమె ముఖవర్చస్సు మారుట, కలతచెందుట విద్యాభూషణుడు గ్రహించి 'ఏమమ్మా! అలా తహ తహ లాడుచుంటి'వని అప్రయత్నంగా సంబోధించేడు. ఆ సమయానికే పురుషోత్తమరావుగారుకూడ వచ్చేరు. అందరు ఆమె మంచం చుట్టు కూర్చున్నారు.

'నాయనలారా! ఈ దిక్కుమాలిన దానిని ఏల బ్రతికించితిరి, చచ్చిపోదామన్నా చావనీయరా? నిన్నటినుంచి నా దుఃఖసాగర మింకిపోయిందనుకున్నాను' అని కంటనీరు పెట్టుకోడం ప్రారంభించింది. పురుషోత్తమరావుగారామెను ఓదార్చి 'మీ రెవరో సద్వంశ సంజాతులవలె నగపడుచున్నారు. బ్రతుకుపై మీకింత నిరుత్సాహమేల?' యని యడిగెను.

'అయ్యా! ఏమని చెప్పుకొనను? నేనొక బ్రాహ్మణపడతిని. రాజోలు కాపరస్థులగు బులుసు వెంకటప్పయ్యగారికి నేను ప్రథమ కళత్రమును. మాకు మొదటి పదివత్సరములవరకు సంతానము లేకపోయింది. పున్నామనరకము సంభవించునేమో యని విచారించి మావారు నా అనుమతి వడసి ద్వితీయ కళత్రమును బడసిరి. ఆ వివాహమైన రెండు సంవత్సరములకు ఏమిమాయమో కాని నేను గర్భవతినైతిని. మగబిడ్డను కంటిని. నా సవతికూడ మూడుమాసములెచ్చు తగ్గుగా ఆడపిల్లను కన్నది. అక్కచెల్లండ్రులాయుండేది, అది మొదలు నాసవతికి నాపై మచ్చరముగలిగింది. మాదికొంచెం గొప్పఆస్తియనే చెప్పవచ్చు. అది అంతయు నాకుమారునికే ముట్టుననియు, మా భర్త ఏక్షణములో హరీయందురో అనే దుష్టబుద్ధితోయుండేది. ఆయనకు పూర్తిగా 50 సంవత్సరాలు నిండలేదు సుమండీ. ఉక్కులాంటిమనిషి. ఆస్తి ఆమెపేర వ్రాయమని నాసవతి ఆయనను ప్రతిరాత్రి పోరుపెడుతూనే యుండేది. ఈలా రోజులు జరుగుతుండేవి.

'ఆసంవత్సరం శ్రీరామ కళ్యాణానికి మావారు భద్రాచలం ప్రయాణమన్నారు. చంటిపిల్లల తీసికొని తీర్థమేమిటని నేనెంత చెప్పినను, మావారి పట్టుదలమీద అందరం బయలుదేరేము. భద్రాచలం చేరుకున్నాము. ఒకయింట తలదాచుకొని, పిల్లకూనలచంకబెట్టుకొని ఎట్లో శ్రీరామదర్శనంచేసేము. ఆరాత్రితో మహోత్సవం పూర్తిఅయింది. మేము మరునాడుఉదయం బయలుదేరు లాంచీపై ప్రయాణంకట్టేము. ఉదయాన్నే స్నానంచేసి శ్రీరామదర్శనం చేసుకుపోదామని తలంచి, పిల్లలతో మా యిద్దరినొక్కసారి తీసుకవెళ్లిన కష్టమని మావారు మొదట నాసవతిని తీసుకొనివెళ్లేరు. వారు తిరిగివచ్చినతర్వాత నాబిడ్డను నాసవతి కప్పగించి మేమూ వెళ్లేము. శ్రీరామదర్శనం చేసుకొని తడిబట్టలతో గోదావరి తీరాన్ని వస్తూంటే వెనక్కాలే నా సవతి వచ్చి 'అయ్యో! పొద్దుపోలేదా? యింకా నెమ్మదిగా వస్తున్నారు. లాంచీ వదిలేస్తాడు రండి, రండి. కూలివాడు సామాన్లు తెస్తున్నాడు' అంటూ మమ్ముల తిన్నగా లాంచీదగ్గరకు తీసుకుపోయింది. సామాన్లు లాంచీలోపెట్టించి 'అక్కా! చప్పు చప్పునఎక్కు' అని నన్ను తొందరపెట్టింది. హడావిడిలో మేము లాంచీ ఎక్కేసేము. పిల్లల నిద్దరిని ఒకచో పరుండబెట్టి యుంటుంది గదా యని నేను లాంచీమీద తడిబట్టలు ఆరవేసుకుంటూ చాలసేపు గడిపేను. అప్పటి కప్పుడే రెండుజాముల ప్రొద్దెక్కింది. పిల్లాడికి పాలవేళయిందని నా సవితియున్నచోటుకు వెళ్లి చూచుసరికి నా బిడ్డడు కనబడలేదు. నలుదిక్కులా చూసేను. ఎచ్చటా లేదు; నా సవితిపిల్లమాత్రముంది. 'చెల్లీ, అబ్బాయిఏడీ?' యని అడిగేను.